సాక్షి విజయనగరం

సోమవారం । 5 । ఆగస్టు । 2024



చదువుకోవాలనుందా..!

పదోతరగతి, ఇంటర్మీడియట్ పూర్తిచేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది.

- 8లో



ఉపాధి నిధులతో పశువుల షెడ్లు

2014-19 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం గోకులం పేరుతో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించే కార్యక్రమం చేపట్టింది.

- 8లో



మళ్లీ సచివాలయం రగడ

మండలంలోని పి.చాకరాపల్లి సచివాలయం రగడ మళ్లీ తెరపైకి వచ్చింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది.

- 8లో

న్యూస్‌రీల్

పైడితల్లి భక్తిగీతమాలిక సీడీ ఆవిష్కరణ



అమ్మవారి భక్తిగీతాల చిత్రమాలిక సీడీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం టౌన్: సిరుల తల్లి శ్రీపైడితల్లి అమ్మవారు ఇతివృత్తాంతాన్ని వివరిస్తూ గాయనీ, గాయకులు ఆలపించిన భక్తిగీతమాలిక సీడీని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. అమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, సీడీ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలందరికీ తన చల్లని దీవెనలు అందజేస్తూ అమ్మవారు ఇంటింటా కొలువైన తల్లిగా ప్రసిద్ధికెక్కారన్నారు. ఆ తల్లి ఆశీస్సులతో రూపుదిద్దుకున్న ఈ సీడీ ప్రతి ఒక్కరి వద్ద ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తిగీతాలాపన ఆద్యంతం ఆకట్టుకుంది. డాక్టర్ భేరిరాధికారాణి శిష్య బృందంతో అమ్మవారిపై రూపొందించిన భరత నాట్య ప్రదర్శన అందరినీ అలరించింది. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాద రావు, సీడీ రూపకర్త ఆర్.సూర్యపాత్రో పాల్గొన్నారు.

మార్పు కోసం మంచి సినిమా ఫెస్టివల్

విజయనగరం టౌన్: మార్పు కోసం మంచి సినిమా పేరుతో జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్‌లో ఆదివారం సాయంత్రం నాలుగు గంటల పాటూ ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమంలో మంచి సినిమా గురించి వక్తలు చర్చించారు. భారత రాజ్యాంగానికి 75 ఏళ్ల సందర్భంగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం చలన చిత్రోత్సవాన్ని విజయనగరం ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు సొసైటీ నిర్వాహకులు జీఎస్.చలం తెలిపారు. ప్రత్యామ్నాయ సినిమాలను ప్రజానీకానికి ముఖ్యంగా యువతకు చేరువ చేసేందుకు పరిమితంగా ఒక ప్రయత్నం చేయడంలో భాగమే ఈ గ్రూప్ ఉద్దేశమన్నారు. యువతరానికి దిశా నిర్దేశం చేసేందుకు ఈ మా ప్రయత్నం అన్నారు. సినిమా అంటే కోట్ల రూపాయలు కాదని, జీవితమన్నారు. జనం జీవితంతో సంబంధం లేని సినిమా అసలు సినిమానే కాదని, సమాజంలో మార్పునకు దోహదం చేసేదే అసలు సినిమా అని పేర్కొన్నారు. అనంతరం పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఎమ్‌విజి.కృష్ణాజీ, మంచి సినిమా నిర్వాహకులు ఐకా బాలాజీ పాల్గొన్నారు.

బడిపై వివక్ష

- 'కానుక' బూట్లుపై కూటమి తూట్లు
- జిల్లాలో 'స్టూడెంట్ కిట్'లకు 1.28 లక్షల మంది అర్హులు
- సైజుల మార్చాలనే నెపంతో 10 శాతం పంపిణీ చేయని బూట్లు
- కిట్ల పంపిణీలో 'పచ్చ' జోక్యం
- టీచర్ల కొరతను పట్టించుకోని కూటమి

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ బడులు బాగుపడ్డాయి. కార్పొరేట్‌ను తలదన్నేలా రూపుదిద్దుకున్నాయి. పిల్లలకు జూన్ 12నే విద్యాకానుక కిట్లు అందాయి. నాణ్యమైన మధ్యాహ్న భోజనం పిల్లలకు అందింది. ఉపాధ్యాయుల కొరత లేకుండా చక్కగా తరగతులు జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక స్టూడెంట్ కిట్లు ఇప్పటికీ పంపిణీ చేస్తున్నారు. భోజనం నాణ్యత కొరవడింది. పలుచోట్ల ఉపాధ్యాయుల కొరతతో విద్యాబోధన కొరవడింది.

జిల్లాలో వివిధ ప్రభుత్వ యాజమన్యాల పాఠశాలలు	1,802
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య	1,34,445
స్టూడెంట్ కిట్స్ ఇండెంట్	1,28,198
గత ఏడాది అమ్మ ఒడి పథకం అర్హులు	1,66,180
వివిధ కేడర్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులు	9,592
మధ్యాహ్న భోజన పథకం అమలు స్కూళ్లు	1,751

విజయనగరం అర్బన్:

పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దింది. వీటితో పాటు విద్య కోసం రూ.2,500 విలువ చేసే 9 రకాల వస్తువులతో కూడిన కిట్టును జగనన్న విద్యాకానుక పేరుతో గడచిన ఐదేళ్ల పాటు పాఠశాల తెరిచిన రోజునే విద్యార్థికి అందే విధంగా ప్రణాళికలు వేసి అమలు చేసింది. జగనన్న విద్యాకానుక పేరును 'స్టూడెంట్ కిట్'గా మార్చిన కూటమి ప్రభుత్వం స్కూళ్లకు కిట్‌లు ఇవ్వడంలో శ్రద్ధ తీసుకోలేదు. ప్రస్తుతం ఎప్పటిలా స్కూళ్ల ప్రారంభం రోజునే వాటి పంపిణీ ప్రక్రియను చేపట్టనీయకుండా ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం అడ్డుకుంది. కిట్‌లోని పుస్తకాలను మాత్రమే ఇమ్మని దాదాపు నెల రోజుల పాటు మిగిలిన సామగ్రి ఇవ్వనీయలేదు. దీంతో గత ప్రభుత్వం సిద్ధం చేసిన సామగ్రి స్కూళ్లలోనే పిల్లలను ఊరిస్తూ స్టోర్ రూంలలో ఉంచాల్సి వచ్చింది.

'పచ్చ' జోక్యం

ప్రజాప్రతినిధులతో పంపిణీ చేయాల్సిన సంస్కృతిని వీడి అధికార పార్టీ కార్యకర్తలు, నాయకుల అడ్డాగా ప్రభుత్వ పాఠశాలలపై కూటమి నేతలు వ్యవహరిస్తున్నారు. స్థానిక కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లకుండా విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లు ఇవ్వడానికి వీల్లేదని ఉపాధ్యాయులకు హెచ్చరికలు ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ కారణం వల్లే స్కూళ్లకు చేరిన కిట్‌లు నెలరోజులుగా పిల్లల ఎదురుగా స్కూల్ స్టోర్ రూంలోనే ఉంచారు. ఇప్పటికీ పంచుతూనే ఉన్నారు.

10 శాతం బూట్లు కొరత

2024 – 25 విద్యా సంవత్సరానికి అమలవుతున్న 'స్టూడెంట్ కిట్' పథకంలో భాగంగా జిల్లాలోని 1,28,198 మంది బాలబాలికలు లబ్ధి పొందుతున్నారు. జగనన్న విద్యాదీవెన పథకం మేరకు స్కూల్ బ్యాగ్ (ఒకటి), యూనిఫారం (మూడు జతలు), షూస్(ఒకటి), షాక్స్‌లు (రెండు), బెల్ట్ (ఒకటి), నోట్ బుక్స్, డిక్షనరీ, పాఠ్యపుస్తకాలతో వర్క్‌బుక్స్ ఎనిమిది వస్తువులతో 'స్టూడెంట్ కిట్' ఉండాలి. కిట్‌లో ఒక్కో విద్యార్థి 3 జతలు యూనిఫాం, ఒక షూ, రెండు సాక్స్‌లు ఇవ్వాల్సి ఉంది. షూల పంపిణీలో సైజుల సమస్య వల్ల తొలిత దాదాపు 15 మండలాలకు ఇబ్బంది కలిగింది. ఆ తరువాత సైజుల వారీగా స్కూళ్లకు ఉన్న డిమాండ్‌ను గుర్తించి గత ఏడాది మిగిలిన వాటిని కలిసి సర్దుబాటు చేసినప్పటికీ ఇంకా 10 శాతం కొరత జిల్లాకు తప్పలేదు.



● ఇప్పటికీ తెరుచుకోని పాఠశాల

సాలూరు మండలం పనసలవలస గ్రామంలో జీపీఎం పాఠశాల ఇప్పటికీ తెరుచుకోలేదు. దీంతో అక్కడ చదువుతున్న ఆరుగురు విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఈ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించకపోవడం శోచనీయం. ఇదిలా ఉంటే ఇక్కడ పాఠశాల ఒక చర్చిలో కొనసాగుతోంది. ఇదే పరిస్థితి మండలంలో నాలుగు జీపీఎస్ పాఠశాలలది. బందపాయిలో నలుగురు, రామస్వామివలసలో ఐదుగురు, నిమ్మలపాడులో 13 మంది విద్యార్థులున్నా.. నేటికీ పాఠశాలలు తెరుచుకోలేదు.

– సాలూరు రూరల్

టీచర్ల కొరతను పట్టించుకోని కూటమి

ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల కొరత తీర్చాలనే ఉద్దేశం కూటమి ప్రభుత్వానికి ఉన్నట్టు లేదు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న సబ్జెక్టు టీచర్ల కొరతను భర్తీ చేయడం చాలా అవసరం. జిల్లాల్లోని వివిధ ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాల పాఠశాలలు 1,802 వరకు ఉన్నాయి. వీటిలో కొన్ని ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది.



విజయనగరం పట్టణంలో ఒక ప్రభుత్వ పాఠశాలలో కిట్ పంపిణీ చేస్తున్న కూటమి నాయకుడు (ఫైల్)

పాఠశాలను తెరవండి



సాలూరు మండలంలో ఇప్పటి వరకు నాలుగు జీపీఎస్ పాఠశాలలు తెరుచుకోలేదు. ఉపాధ్యాయులను తక్షణమే నియమించి వెంటనే తెరిపించాలి. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా... ఈ నిర్లక్ష్యం ఏమిటో అర్థం కావడం లేదు.

– ఎ.సాంబ, కురుకూటి గ్రామం, సాలూరు

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు



ప్రభుత్వం మారినంత మాత్రాన విద్యార్థుల భవిష్యత్ కోసం చేపట్టిన పథకాలు విస్మరించరాదు. జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు పొందిన నాడు – నేడు మన పాఠశాల పథకంలో పనులకు నిధులు కేటాయించాలి. విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు. ఆరోగ్యవంతమైన విద్యాబోధనకు సహకరించాలి. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి.

– కిల్లారి చంటి, చైర్మన్, పీఎంసీ కమిటీ, సొలికిరి, భామి

ప్రైవేటు పాఠశాలలో చేర్పించా..



ఈ ఏడాది మా అబ్బాయిని ప్రైవేట్ పాఠశాలలో చేర్పించాను. గతేడాది వరకు కుమార్‌రాజాను ప్రభుత్వ పాఠశాలలో చదివించాను. ఇంగ్లిష్ మీడియం చదువు కోసం ఈ ఏడాది సంతకవిటిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చేర్పించాను. ఇంగ్లిష్ మీడియం వద్దన్న ప్రభుత్వం వచ్చింది కాబట్టి ప్రభుత్వ పాఠశాలలపై పెద్దగా నమ్మకం కలగడం లేదు.

– వావిలపల్లి పుణ్యవతి, శ్రీహరినాయుడుపేట, సంతకవిటి

బకాయిలు చెల్లించాలి



జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం(గోరుముద్ద) పథక నిర్వహణ కోసం పని చేస్తున్న ఆయాలకు కొద్ది నెలలుగా గౌరవ వేతనం అందడం లేదు. దీంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం బకాయిలు చెల్లించాలి.

– గొర్లె వెంకటరమణ, కోశాధికారి, సీఐటీయూ

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు: ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని ఎస్పీ వకుల్‌జిందల్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, నగర శివారు ప్రాంతాల్లో మద్యం తాగుతున్న 171 మందిపై ఇప్పటికే కేసులు నమోదు చేశామన్నారు. అలాగే ఇసుక, పశువులు తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. మద్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు, డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన పోలీసు అధికారులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 15 కేసులు నమోదు చేశామన్నారు.

పైసలిస్తే పసుపు బిళ్ల

- నచ్చనివారికి వైఎస్సార్ సీపీ ముద్ర
- పోలీసు శాఖలోనూ టీడీపీ నాయకుల పెత్తనం
- పోలీసు శాఖలో చక్రం తిప్పుతున్న ఓ హెడ్ కానిస్టేబుల్
- నచ్చిన చోట పోస్టింగ్ కోసం సీఐల నుంచి రూ.5 లక్షల చొప్పున వసూళ్లు?



సాక్షి ప్రతినిధి, విజయనగరం :

కూటమి ప్రభుత్వ పాలన కొరివితో తలగోక్కున్నట్లుగా ఉందని సామాన్యులు ఇప్పటికే లోలోన కుమిలిపోతున్నారు. చిరుద్యోగుల నుంచి ప్రభుత్వంలో ఉన్నత ఉద్యోగుల వరకూ అదే భావనలో ఉన్నారు. ఇప్పుడా జాబితాలో పోలీసులు కూడా చేరిపోయారు. ఆ శాఖలోనే కొంతమంది దళారులు తయారైపోయారు. వారి మాట టీడీపీ నాయకులకు తారకమంత్రంలా పని చేస్తోంది. వారు చెప్పినవారికే పోస్టింగ్, వారికి నచ్చనివారికి ఊస్టింగ్ ఇచ్చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు సిఫారసు చేసేస్తున్నారు. ఇప్పుడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో ఆ విషయం మరోసారి ప్రస్ఫుటమవుతోంది. దీంతో ఆ పోలీసు ముసుగులోనున్న దళారులను ప్రసన్నం చేసుకోవడానికి సీఐలు, ఎస్సైలు ఆపసోపాలు పడుతున్నారు. ముడుపులు ఇచ్చేస్తే మనకు కావాల్సినవారేనంటూ టీడీపీ నాయకులకు చెప్పి 'పసుపు బిళ్ల' వేయిస్తున్నారు.

విశాఖ రేంజ్ పరిధిలో 35 మంది సీఐలకు బదిలీ చేస్తూ డీఐజీ గోపీనాథ్ జెట్టి జారీ చేసిన ఉత్తర్వులు ఆదివారం వెలువడ్డాయి. విజయనగరం జిల్లా కేంద్రానికి సంబంధించి వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ ప్రధాన విభాగాల్లో పని చేస్తున్న ముగ్గురు సీఐలతో పాటు విజయనగరం జిల్లాలో మరో 12 మంది సీఐలకు ఎటువంటి పోస్టింగ్‌లు ఇవ్వకుండా వీఆర్‌లో పెట్టేయడం గమనార్హం. ఒకరకంగా చెప్పాలంటే ఇదొక పనిష్మెంట్‌గా భావిస్తుంటారు. ఇంతకుముందు డీఎస్పీల బదిలీల్లోనూ ఇలాంటి ధోరణి కనిపించింది. చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తిని బదిలీ చేసి, డీజీపీ కార్యాలయానికి ఎటాచ్ చేయడం చర్చనీయాంశమైంది.

రెడ్‌బుక్ ముసుగులో...

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గత సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అర్ధరాత్రి వరకూ పోలింగ్ జరిగినా ఎక్కడా పెద్ద అల్లర్లేవీ లేవు. టీడీపీ నాయకులు అక్కడక్కడా హడావుడి చేస్తే చూసీచూడనట్లు వ్యవహరించారు. కొన్నిచోట్ల టీడీపీ అభ్యర్థులకు ఓటేయాలని సైగలు చేసిన పోలీసులు కూడా ఉన్నారు. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల్లాగే పోలీసులకూ సెగ మొదలైంది. వైఎస్సార్‌సీపీ బ్లడ్ ఇంకా కొంతమంది పోలీసుల్లో ప్రవహిస్తోందంటూ సాక్షాత్తూ హోం మంత్రి వంగలపూడి అనితే వ్యాఖ్యానించడం, రెడ్ బుక్‌లో రాసుకున్నవారి భరతం పడతాం అంటూ టీడీపీ నాయకులే బెదిరించడం ఇప్పుడు కొంతమంది దళారులకు కలిసివస్తోంది. తమను ప్రసన్నం చేసుకున్నవారికి, పైసలిచ్చినవారికి కావాల్సిన చోట పోస్టింగ్‌లు వచ్చేలా చక్రం తిప్పుతున్నారు. కాదంటే వైఎస్సార్‌సీపీ నేతలకు అనుకూలురనే ముద్ర వేస్తున్నారు. రెడ్‌బుక్ సాకుతో వారందరికీ వేరేచోటకు బదిలీలు చేయిస్తున్నారు.

ప్రసన్నం చేసుకుంటే పసుపుబిళ్ల

టీడీపీ గ్రామ, మండల స్థాయి నాయకులకు, టీడీపీ కార్యకర్తలకు ఇప్పటికే 'పసుపు బిళ్ల' ఇచ్చేశారు. అది వేసుకొని ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా సకల మర్యాదలు చేసి వారి అడిగిన పని చేయకపోతే కబడ్దార్ అని సాక్షాత్తూ తాజా మాజీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులకూ ఆ బిళ్లలు తగిలిస్తున్నారు. తమకు అనుకూలమైనవారైతే చాలు కోరినచోట పోస్టింగ్ ఇస్తున్నారు. అప్పటికే ఆ స్థానాల్లో ఉన్నవారు ఉత్తమ సేవలు అందిస్తున్నా తమకు కావాల్సినవారి కోసం పక్కన పెట్టేస్తున్నారు. కారణమేమిటంటే వారు వైఎస్సార్ సీపీ నేతలకు అనుకూలంగా పనిచేస్తున్నారనే ముద్ర వేస్తున్నారు.

ఇదేమి ఖర్మరా రామా...

రాజకీయ పలుకుబడి కోసం నిత్యం తాపత్రయపడే ఓ హెడ్‌కానిస్టేబుల్ ఇప్పుడు సీఐలు, ఎస్సైల బదిలీల్లో బాగానే దండుకుంటున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఉద్యోగ బాధ్యతలు సవ్యంగా ఏరోజూ నెరవేర్చిన దాఖలాలు లేవని సొంత శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కొన్నాళ్లు యూనియన్ నాయకుడిగానూ చక్రం తిప్పారు. ప్రస్తుతం పోలీసు కంట్రోల్ రూమ్‌లో ఉన్నా అసలు పనికన్నా పోలీసు శాఖపై కంట్రోల్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. టీడీపీ ఎమ్మెల్సీ రఘువర్మ, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తండ్రి కొండలరావు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి వియ్యంకుడు అర్జునరావు వంటి నాయకులతో తనకున్న పరిచయాలను బాగా వాడుకుంటున్నాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పోలీసు శాఖలో తనకు నచ్చనివారిని, తనను ప్రసన్నం చేసుకోనివారిని జిల్లా నుంచి తప్పించేందుకు తన ప్రయత్నాలు తాను చేసుకుపోతున్నారు. వారంతా వైఎస్సార్‌సీపీ నాయకులకు అనుకూలంగా పనిచేశారని, ఎన్నికల తర్వాత కూడా పనిచేస్తున్నారని ఆయా నాయకులకు చెబుతున్నారని తెలిసింది. అతని మాటే పరిగణనలోకి తీసుకొని పోలీసు శాఖలో బదిలీలకు టీడీపీ నాయకులు సిఫారసు చేస్తున్నారు. దీంతో చాలామంది సీఐలు, ఎస్సైలు ఇదేం ఖర్మరా రామా అనుకుంటూ సింహాద్రి అప్పన్న ప్రసన్నం చేసుకోవడానికి సింహాచలం వెళ్తున్నట్లే ధర్మపురి ప్రాంతంలో ఉన్న సదరు హెడ్ కానిస్టేబుల్ ఇంటి ముందు బారులు తీరుతున్నారు. ఇదే అదనుగా ఎస్సైల నుంచి రూ.3 లక్షల చొప్పున, సీఐల నుంచి రూ.5 లక్షల వరకూ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ వచ్చి సంయుక్తంగా కలెక్టరేట్ వద్ద సభ నిర్వహించినప్పుడు టీడీపీ కార్యకర్తల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆ పార్టీ నాయకులే గుర్రుగా ఉన్న ఓ పోలీసు అధికారికి నచ్చిన చోట పోస్టింగ్ ఇప్పించడమే సదరు హెడ్‌కానిస్టేబుల్ సత్తా ఏమిటో అర్థమవుతోందని చెబుతున్నారు. తదుపరి ఎస్సైల బదిలీలు ఎలా ఉంటాయో చూడాలి.

విశాఖ రేంజ్ పరిధిలో సీఐలకు బదిలీలు

విజయనగరం క్రైమ్: విశాఖ రేంజ్ పరిధిలో 35 మంది సీఐలను బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
హనుమంతు ఉపేంద్రరావు	ఎస్.కోట	రాజాం రూరల్
కట్టా రవికుమార్	పార్వతీపురం రూరల్	ఎస్.కోట
సనబోయిన శ్రీనివాస్	రాజాం రూరల్	విజయనగరం వన్‌టౌన్
బి.వెంకటరావు	విజయనగరం వన్‌టౌన్	వీఆర్
పి.రంగనాథం	విజయనగరం ట్రాఫిక్	వీఆర్
చరకాన సూరినాయుడు	శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్‌సెల్	విజయనగరం ట్రాఫిక్
సీహెచ్ షణ్ముఖరావు	చీపురుపల్లి	కొత్తవలస
వి.చంద్రశేఖర్	కొత్తవలస	వీఆర్
యవ్వారి మురళీరావు	ఎస్.కోట అర్బన్	వీఆర్
గండెం రామకృష్ణ	విజయనగరం పీటీసీ	భోగాపురం సీఐ
బీవీ వెంకటేశ్వరరావు	భోగాపురం	వీఆర్
టి.శ్రీనివాసరావు	విజయనగరం ఏసీబీ	విజయనగరం టూటౌన్
కోరాడ రామారావు	విజయనగరం టూటౌన్	వీఆర్
ఎన్‌వీ ప్రభాకరరావు	గజపతినగరం	వీఆర్
జీవీ రమణ	ఏసీబీ సీఐ	గజపతినగరం

శ్రావణం.. శుభప్రదం

- మొదలైన మంచి ముహూర్తాల సందడి
- ప్రారంభం కానున్న వివాహాది, శుభ కార్యక్రమాలు
- వేలాది మందికి దొరకనున్న ఉపాధి

విజయనగరం:

హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసానికి ప్రత్యేక స్థానం ఉంది. వివాహాది శుభకార్యాలకు అనువైన మాసం. ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు శ్రావణ మాసం కొనసాగనుంది. నెల రోజుల పాటు శ్రీలక్ష్మీ అమ్మవారికి పూజలు చేయడంతో పాటు మహిళలు వ్రతాలు ఆచరిస్తారు. వివాహాలు, గృహ ప్రవేశాలు, నిశ్చితార్థాలు, శంకుస్థాపనలు, వ్యాపార ప్రారంభోత్సవాలు, అన్నప్రాశన, అక్షరాభ్యాసం, విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తారు.

వరలక్ష్మీ వ్రతాలు

శ్రావణ మాసం అంటే గుర్తుకొచ్చేవి శ్రీవరలక్ష్మీ అమ్మవారి వ్రతాలు. రెండో శుక్రవారం (ఆగస్టు 16న) మహిళలు వరలక్ష్మీ వ్రతం చేసుకుంటారు. కుదరని వారు నాలుగో శుక్రవారం (ఆగస్టు 30న) ఆచరిస్తారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో శ్రీలక్ష్మీదేవికి దేవాలయాల్లో విశేష పూజలు, వ్రతాలు, సామూహిక కుంకుమ పూజలుంటాయి.

శుభ ముహూర్తాలకు వేళాయే...

శుభ ముహూర్తాలకు వేళయింది. నూతనంగా దాంపత్య జీవనం ప్రారంభించేందుకు తహతహలాడుతున్న వారికి శ్రావణ మాసం తన వెంట మంచి ముహూర్తాలను తీసుకువచ్చింది. వరుస మహూర్తాలు వస్తుండటంతో జిల్లాలో పెళ్లి సందడి ప్రారంభమైంది. ఈ నెల 5 నుంచి శ్రావణమాసం ప్రారంభవుతుండటంతో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ నూతన జీవితాలను ప్రారంభించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



వివాహ వేడుకకు సిద్ధమైన కల్యాణ మండపం



విజయనగరం జిల్లా కేంద్రంలోని వస్త్ర దుకాణంలో శ్రావణమాసం సందడి

వేలాది మందికి ఉపాధి

శ్రావణ మాసం ప్రారంభంతోనే పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావటంతో అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇప్పటికే కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. విజయనగరం జిల్లా కేంద్రంలో ఒక రోజుకు సాధారణ కల్యాణ మండపం రూ.40 వేల నుంచి అన్ని హంగుల కలిగిన మండపాలు రూ.5 లక్షల వరకు పలుకుతున్నాయి. ఇక భోజనాల కోసం క్యాటరింగ్ వారిని నియమించుకుంటున్నారు. సాధారణ భోజన ప్లేటు రూ.200 నుంచి వివిధ రకాల కనువిందు చేసే ఖరీదైన భోజనం రూ.700కు పైమాటే పలుకుతుంది. ఊరేగింపులో సందడి చేసే డీజే మ్యూజిక్‌లు, బ్యాండ్ మేళాలు, పురోహితులను ఇప్పటికే పురమాయించుకుంటున్నారు. ఇదిలా ఉండగా పెళ్లికి అవసరమైన వస్త్రాలు, బంగారు ఆభరణాల కొనుగోళ్లతో జిల్లాలోని వివిధ పట్టణాలు సందడిగా మారాయి.

మంచి ముహూర్తాలు ఉన్నాయి..

శ్రావణమాసంలో మంచి ముహూర్తాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా వేలాది పెళ్లిళ్లతో పాటు వివిధ శుభ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మంచి రోజులు వచ్చాయి. ఇప్పటికే చాలా మంది వివాహ ముహూర్తాలను నిర్ణయించుకుని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రారంభమై శ్రావణం వరకు మంచి రోజులు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో చాలా మంది వివాహాది, శుభ కార్యక్రమాలు జరుపుకునేందుకు సన్నద్ధమవుతున్నారు.

– పి.కామేశ్వర శర్మ, వేదపండితులు

క్లుప్తంగా

ఆదివాసీ దినోత్సవానికి ఆహ్వానం

● మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరను కలిసిన గిరిజన సంఘాలు



మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను ఆహ్వానిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

సాలూరు: పాచిపెంట మండలం గొట్టూరు పంచాయతీ పూతికవలస గ్రామంలో ఈ నెల 8న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను గిరిజన సంఘాల నాయకులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం రాజన్నదొరను సాలూరు పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిశారు. ఆహ్వాన పత్రికను అందించి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు చెదల రాజు, మాదల సింహాచలం, ముఖీ మల్లేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాని మాస్టారుకు మాతృ వియోగం



మహలక్ష్మి

బొబ్బిలి: అభ్యుదయ విద్యాసంస్థల అధినేత మర్రాపు కూర్మినాయుడు(నాని మాస్టారు) మాతృమూర్తి మహలక్ష్మమ్మ(90) శనివారం రాత్రి పరమపదించారు. ఆమెకు ఆరుగురు సంతానం కాగా ఐదుగురు ఉన్నారు. వారిలో రామచంద్ర శేఖర రావు, కూర్మినాయుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. ఆమె కోడలు చింత శారద అభ్యుదయ విద్యాసంస్థల ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. మహలక్ష్మి మృతి సమాచారం అందుకున్న పలువురు ప్రముఖులు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు ఆదివారం జరిగాయి.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీ, పీఈటీ తదితరులు

సాలూరు: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆశీర్వాదం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న జనార్దన సాయి, ఇసాక్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి 19 వరకు శ్రీకాకుళం జిల్లాలో రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ, పీఈటీ విద్యాసాగర్, నాయుడు అభినందించారు.

ప్రభుత్వ విధానాలు అంతేనా..?

● ఏపీటీఎఫ్ సూటి ప్రశ్న

పార్వతీపురంటౌన్: విద్యారంగాన్ని గాడిలో పెడతామని ప్రకటించిన ఎన్డీఏ ప్రభుత్వం మరిన్ని తప్పిదాలను కొనసాగించడాన్ని ఖండిస్తున్నట్లు ఏపీటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యారంగాన్ని తీవ్రంగా నష్టాల పాలు చేసిన 117 జీవో రద్దు చేస్తామని ప్రకటించి కూడా ఇప్పటివరకు ఆ ప్రయత్నం చేయలేదు, సరి కదా ఇప్పుడు తాజాగా జరగనున్న పని సర్దుబాటు ఆ జీఓ ప్రాప్తికి రాష్ట్రస్థాయిలో కమిషనరేట్ నుంచి జరపాలని నిర్ణయించడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. గతంలో జరిగిన సర్దుబాటు వల్ల ఉపాధ్యాయులకు ఇబ్బంది తలెత్తితే జిల్లాస్థాయి అధికారులు పరిష్కరించేవారు. ఇప్పుడు ఆ అవకాశం కూడా ఇవ్వకుండా కమిషనరేట్ నుంచి నిర్వహించడం సరైన విధానం కాదన్నారు. 10 మంది విద్యార్థుల లోపు ఉన్న పాఠశాలలను మూసివేసే ప్రయత్నం కూడా చేస్తున్నట్లు తెలుస్తోందని, ఇది విద్యారంగానికి పాఠశాలల మనుగడకు తీవ్ర హాని కలిగించే నిర్ణయమని ఏపీటీఎఫ్ భావిస్తుందని, తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని అన్ని గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఉండే విధంగా, అవి సమర్థవంతంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ కోరుతున్నట్లు పేర్కొన్నారు. విద్యాశాఖలో నెలనెలా ప్రమోషన్లు ఇచ్చే విధంగా ఆదేశాలు ఉన్నాయని కానీ సంవత్సర కాలంగా ఈ ఉత్తర్వులు అమలు కావడం లేదని అసంతృప్తి వెళ్లగక్కారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹180

చదువుకోవాలనుందా..!

● ఓపెన్ అవకాశాలు అందిపుచ్చుకోండి
● టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ
● ఇంటి దగ్గర నుంచి చదివే అవకాశం
● విడుదలైన నోటిఫికేషన్
● ఆగస్టు 28లోగా దరఖాస్తు చేసుకోవాలి



స్టడీ సెంటర్‌లో చదువుతున్న ఓపెన్ స్కూల్ విద్యార్థులు (ఫైల్)

పార్వతీపురం: ఉన్నత విద్య కోసం ఆశపడినా అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చిన్నప్పుడే చదువుకు దూరమైన అనేక మందికి పదోతరగతి, ఇంటర్మీడియట్ పూర్తిచేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది. నియత పాఠశాలలో చదువుకునే అవకాశం లేని బాలబాలికలు, వయోజనులకు విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 1991లో ఏపీ ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. రోజు వారీ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా సార్వత్రిక పాఠశాలద్వారా పదోతరగతి, ఇంటర్మీడియట్ చదివే అవకాశాన్ని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని 12 స్టడీ సెంటర్ల ద్వారా ఏటా వేలాది మంది చదువుకునేందుకు దీని ద్వారా అవకాశం లభిస్తోంది. సార్వత్రిక పాఠశాలలో చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. దీంతో ఉన్నత చదువులకు, ఉద్యోగాలు పొందేందుకు అర్హత ఉంటుంది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఎంసెట్, డైట్ సెట్ వంటి పరీక్షలతోపాటు ఇంటర్ అర్హతతో పొందే అన్ని ఉద్యోగాలకూ అర్హులవుతారు.

ఐదేళ్లలో పూర్తి చేయాలి

అభ్యాసకులు నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్ పరీక్షలు రాసే వారు మాత్రం టెన్త్ పాసై రెండేళ్లు వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులూ ఒకేసారి రాసుకునే అవకాశం ఉంటుంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక్క సబ్జెక్టు రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి, ఉత్తీర్ణ పొందలేకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.

మార్కుల బదలాయింపు

పాఠశాల తరగతి, ఇంటర్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు కూడా సార్వత్రిక పాఠశాలలో చేరి, సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకుని పది, ఇంటర్ పాసయ్యే అవకాశం ఉంటుంది. రెగ్యులర్ టెన్త్, ఇంటర్ ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్ల లోపు సార్వత్రిక పాఠశాలలో చేరితే, రెగ్యులర్ పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెకుల మార్కులను బదలాయించుకునే వీలుంటుంది. టెన్త్ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలూ రాస్తే సరిపోతుంది. మార్కులు బదలాయించుకునే వారు సబ్జెక్టుకు పదో తరగతికైతే రూ.100, ఇంటర్‌కు రూ.150 చొప్పున అడ్మిషన్ సమయంలో అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

ఇవీ సబ్జెక్టులు

☛ పదో తరగతికి గ్రూపు-'ఎ'లో ఇంగ్లీషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం /ఒరియా తీసుకో వచ్చు. గ్రూపు-'బి'లో గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి.
☛ ఇంటర్‌కు గ్రూపు-'ఎ'లో ఇంగ్లీషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు.
☛ గ్రూపు-'బి'లో ప్రధాన సబ్జెక్టుల్లో మూడింటితో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది.



ఓపెన్ స్కూల్ లోగో

ఇవీ అర్హతలు

☛ పదో తరగతిలో చేరేందుకు వచ్చే ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ట వయోపరిమితి ఉండదు. చదవడం, రాయడం తెలిసి ఉండాలి.
☛ దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటరుకు 10వ తరగతి మార్కుల జాబితా, టెన్త్ టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు కుల ధ్రువీకరణతో పాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలి.

గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి



కొత్తగా అడ్మిషన్ పొందగోరే వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి. మధ్యలో చదువు మానేసి, తిరిగి కొనసాగించే వారికి ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా చక్కని అవకాశం లభిస్తోంది. ఉపాధి, ఉన్నత చదువులకు ఉపకరిస్తుంది. ఈ సర్టిఫికెట్‌కు ప్రభుత్వ గుర్తింపు ఉంది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

–జి.పగడాలమ్మ, డీఈఓ, పార్వతీపురం మన్యం

ఆగస్టు 28వరకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. జూలై 31నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్‌ల ప్రక్రియ ప్రారంభమైంది. అపరాధ రుసుం లేకుండా ఆగస్టు 28వ తేదీలోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 29నుంచి సెప్టెంబర్ 4వరకు అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తారు. ప్రవేశాలు పొందగోరే వారు ఆయా అధ్యయన కేంద్రాల్లో ఏఐ కోర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి.

కాంట్రాక్ట్ తరగతులు

ఓపెన్ స్కూల్లో అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం ఆయా అధ్యయన కేంద్రాల్లో 30 కాంట్రాక్ట్ తరగతులు నిర్వహిస్తారు. కనీసం 24 కాంట్రాక్టు తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి/ఏప్రిల్ నెలల్లో నిర్వహించే పరీక్షలకు అనుమతిస్తారు.సార్వత్రిక పాఠశాలలో చేరే వారికి స్టడీ మెటీరియల్‌ను సరఫరా చేస్తారు.

దాడిలో గాయపడిన మహిళ మృతి

సంతకవిటి: మండల పరిధిలోని కేఆర్ పురం గ్రామంలో రచ్చబండపై కూర్చున్న కాయల ఎల్లమ్మ (60)పై అదే గ్రామానికి చెందిన తేగల రాము ఇటీవల మద్యం మత్తులో వచ్చి దాడి చేయడంతో గాయాలపాలైన ఆమె శ్రీకాకుళంలోని రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈ మేరకు ఆదివారం ఉదయం మృతురాలి తమ్ముడు కె.త్రినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యా నేరం కేసుగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ వెల్లడించారు. రాజాం రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాయల ఎల్లమ్మను గాయపరిచినట్లు ఈ నెల ఒకటవ తేదీన పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుకాగా ఆదివారం హత్యానేరంగా కేసును తిరిగి నమోదు చేసినట్లు తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అతిథులు

విజయనగరం: జిల్లా వేదికగా రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో నగరంలోని గురజాడ పాఠశాలలో అండర్-7 విభాగంలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పోటీపడ్డారు. రెండు రోజుల పాటు ఆద్యంతం ఉత్కంఠ భరిత వాతావరణంలో సాగిన పోటీల్లో విజయమే లక్ష్యంగా చిన్నారులు ప్రత్యర్థుల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ విజయమే లక్ష్యంగా పోటీపడ్డారు. పోటీల్లో బాలికల విభాగంలో గుంటూరుకు చెందిన ఎఎస్ఎస్ఎస్. కావ్య ప్రథమ స్థానం దక్కించుకోగా.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎ.వేదష్వి ద్వితీయ స్థానంలో నిలిచింది. అదేవిధంగా బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారుడు ఎ.శశాంక్, పల్నాడు జిల్లాకు చెందిన ఎ.మాగ్నస్‌లు మొదటి, రెండవ స్థానాలు దక్కించుకున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు త్వరలో మైసూరులో జరగనున్న జాతీయ స్థాయి అండర్-7 బాల, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పార్వతీపురం-మన్యం జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ కృష్ణాజీ, రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలకు ఎం.రాజీవ్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించగా పులువురు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ప్రతినిధులు పర్యవేక్షించారు.

పంచాయతీలకు గ్రేడ్-5 కార్యదర్శులు

● ఇన్‌చార్జ్ కార్యదర్శులకు తగ్గనున్న పనిభారం



పాలకొండ మండలంలోని వాటపాగు పంచాయతీ కార్యాలయం

పాలకొండ రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శుల (పీఎస్) కొరతను అధిగమించేందుకు సంబంధిత అధికార యంత్రాంగం అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే డీడీఓ అధికారాలు చేపట్టిన గ్రామ సచివాలయాల్లో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ లాగిన్‌లో మ్యాపింగ్ చేసేందుకు కసరత్తు జరుగుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో గల 15 మండలాల పరిధిలో 451 గ్రామ పంచాయతీలకు 1 నుంచి 4 గ్రేడ్‌లకు సంబంధించి 214 మంది కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసుకున్న క్లస్టర్ల వారీగా చూస్తే జిల్లా పరిధిలో 236 క్లసర్లు ఉన్నాయి. వాటిలో గ్రేడ్-1 లేరు. గ్రేడ్-2 గా నలుగురు, గ్రేడ్-3గా ఇద్దరు, గ్రేడ్-4గా 185 మంది పేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొన్ని గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత జనాభా లెక్కల ప్రాప్తికి మరో 25 మంది గ్రేడ్-4, 20 మంది గ్రేడ్-5 కార్యర్శులు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. ఇన్‌చార్జ్‌లతో పాలన కుంటు పడుతుందని భావించిన గత వైఎస్సార్‌సీపీ సర్కార్ గ్రామ సచివాలయాల్లో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులను కూడా డీడీఓ అధికారాలతో గ్రామ పంచాయతీలకు నియమించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ఈ ప్రక్రియ అమలులో కొంత జాప్యం జరిగింది. అప్పట్లోనే డీడీఓ అధికారాలను తీసుకున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల పొజిషన్ ఐడీలను నేటికీ సంబంధిత ఎంపీడీఓల సీఎఫ్ఎంఎస్ లాగిన్ మ్యాపింగ్ చేయకపోవడంతో జీతాలు, నిధుల వ్యయం, బిల్లుల తయారీకి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల వివరాలను ఎంపీడీఓ లాగిన్‌లో మ్యాపింగ్ చేయనున్నారు. గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 197 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులను తాజా నిర్ణయంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులను పూర్తిస్థాయి అధికారాలతో జిల్లా పరిధిలో గ్రామ పంచాయతీలకు పంపనున్నారు.

మ్యాపింగ్ చేస్తున్నాం



జిల్లాలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల పొజిషన్ ఐడీలను ఎంపీడీఓ లాగిన్ మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేశాం. డీడీఓ అధికారాలు ఉన్నప్పటికీ ఎంపీడీఓల లాగిన్ మ్యాపింగ్ కాకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ చర్యలు చేపట్టాం. ఈ ప్రక్రియ పూర్తి అయితే మెజారిటీ గ్రామ పంచాయతీల్లో పాలన సులభతరమవుతుంది. 197 మంది గ్రేడ్-5 కార్యదర్శులను గ్రామ పంచాయతీలకు కేటా యించడం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో వేగం పుంజుకుంటుంది. ఈ క్రమంలో వారి సంఖ్య కూడా 197 నుంచి 215కు పెరగాల్సి ఉంది.

– బలివాడ సత్యనారాయణ, డీపీఓ, పార్వతీపురం మన్యం

మళ్లీ సచివాలయం రగడ

● పి.చాకరాపల్లి సచివాలయంలో సామగ్రి కనిపించకపోవడంపై పిర్యాదు



చాకరాపల్లి సచివాలయం

బలిజిపేట: మండలంలోని పి.చాకరాపల్లి సచివాలయం రగడ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో సచివాలయం మాది అంటే మాది అని పదమాయవలస, పి.చాకరాపల్లి పంచాయతీల సర్పంచ్‌లు అస్త్రాలు సంధించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈనెల 1వ తేదీన కంప్యూటర్, ప్రింటర్, సీపీయూ, 6కుర్చీలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు పి.చాకరాపల్లి సచివాలయం కార్యదర్శి గంగరాజు బలిజిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో గొడవ మళ్లీ మొదలైంది. వివరాల్లోకి వెళ్తే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి పక్కా భవనాల నిర్మాణాలు చేపట్టింది. పదమాయవలస, పి.చాకరాపల్లి గ్రామ పంచాయతీలు పక్క, పక్కనే ఉన్నా మధ్యలో సువర్ణముఖి నది ఉంది. పి.చాకరాపల్లి గ్రామం పెద్దది అందువల్ల తమ మాగ్రామానికి సచివాలయం భవనాన్ని ఇప్పించాలని సర్పంచ్ మోహనరావు పలు పర్యాయాలు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఎట్టకేలకు పీఆర్ అండ్ ఆర్‌డి ఆదేశాలతో సచివాలయ భవన నిర్మాణాలను మార్పుచేయాలని సిఫార్సుతో పి.చాకరాపల్లిలో నూతన భవనం నిర్మాణం చేశారు. దీనికి సంబంధించిన పనులన్నీ సక్రమంగా సాగాయి. ఆగస్టు 9, 2022న నూతన సచివాలయ భవనాన్ని అప్పటి ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. అప్పటినుంచి సచివాలయానికి సంబంధించిన అన్ని వ్యవహారాలు సజావుగా సాగుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం మారడంతో సచివాలయం రగడ మళ్లీ తెరపైకి వచ్చింది. అందులో భాగంగా ఈనెల 1వ తేదీన సచివాలయంలో ఉన్న కంప్యూటర్, ప్రింటర్, సీపీయూ, 6కుర్చీలను గుర్తుతెలియని వారు పట్టుకుని వెళ్లిపోయినట్లు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే విజయచంద్ర సమక్షంలో దీనిపై చర్చ జరిగింది. అధికారులకు, పోలీస్‌శాఖకు ఇవి ఎక్కడ ఉన్నాయో, ఎవరు పట్టుకువెళ్లారో తెలిసినప్పటికీ అందరూ దోబూచులాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎంపీడీఓ రమేష్‌నాయుడును వివరణ కోరగా గ్రామ కార్యదర్శితో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించామని తెలిపారు.



సచివాలయం మార్పుతో ఇచ్చిన కొత్త ఉత్తర్వులు

బైక్ అదుపు తప్పి సచివాలయ ఉద్యోగి మృతి



కర్రి సాగర్ (ఫైల్)

శృంగవరపుకోట: మండలంలోని ఎస్.కోట మేజర్‌పంచాయతీ సచివాలయం-1లో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కర్రి సాగర్ (35) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శ్రీకాకుళానికి చెందిన సాగర్ మూడేళ్లుగా ఎస్.కోట సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని శ్రీకాకుళంలో ఉన్న తన తల్లిని చూసేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. లావేరు మండలంలోని సుభద్రాపురం వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సాగర్ మృతిపై స్థానిక గ్రామ సచివాలయం ఉద్యోగులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

గిరిజనాభ్యున్నతికి కృషి చేయాలి

సాలూరు: ఆదివాసీల హక్కులను పరిరక్షిస్తూ, గిరిజనాభ్యున్నతికి అందరం కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కోరారు. ఈ మేరకు గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సాలూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గిరిజన చట్టాలను, హక్కులను పరిరక్షించాలని, గిరిజన రిజర్వేషన్లు సక్రమంగా అమలుచేయాలని, జీఓ నంబర్ 3ను పునరుద్ధరించాలని కోరారు. అందరికీ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

త్వరలోనే ట్రైకార్ రుణాల మంజూరు

కార్యక్రమంలో మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్త్రీ శిశుసంక్షేమం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ, గిరిజనులకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా త్వరలోనే ట్రైకార్ రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. నిరుద్యోగ యువతకు పోటీపరీక్షలకు శిక్షణ తరగతులు త్వరలో వైటీసీలో ప్రారంభమవుతాయని చెప్పారు. అన్ని గిరిజన గ్రామాలకు ఫీడర్‌అంబులెన్స్‌లు వెళ్లే విధంగా రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గిరిజన సంప్రదాయ థింసా నృత్యంలో మంత్రి సంధ్యారాణి మహిళలతో కలిసి కాలు కదిపారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు కార్యక్రమంలో మాట్లాడుతూ రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులు, ప్రయోజనాల కోసం అందరం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు గిరిజనసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 40 నాటుకోళ్ల మృతి



మృతి చెందిన నాటుకోళ్లు

తెర్లాం: మండలంలోని మాధంబట్లవలస గ్రామంలో కుక్కల దాడిలో 40 నాటుకోళ్లు మృతిచెందాయి. దీనికి సంబంధించి కోళ్ల ఫారం యజమాని తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాళ్ల సూర్యనారాయణ నాటుకోళ్ల ఫారం నడుపుతున్నాడు. ఆదివారం ఉదయం 7గంటల సమయంలో కోళ్లఫారంలో ఎవరూ లేని సమయంలో కుక్కలు చొరబడి 40కోళ్లను చంపేశాయి. చేతికి అందించి వచ్చిన కోళ్లను కుక్కలు దాడి చేసి చంపేయడంతో కోళ్లఫారం యజమాని ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. ఇదే కోళ్లఫారంలో కొన్ని రోజుల క్రితం సుమారు 150 నాటుకోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వరుస సంఘటనలతో ఆర్థికంగా నష్టపోయానని యజమాని లబోదిబోమంటున్నాడు.

ఉపాధి నిధులతో పశువుల షెడ్లు



గతంలో గోకులం పేరుతో నిర్మించిన పశువుల షెడ్డు

● గత టీడీపీ పాలనలో గోకులాలు
● అప్పట్లో పార్టీ కార్యకర్తలకే కేటాంచారని విమర్శలు
● మళ్లీ అదే ప్రభుత్వంలో తెరపైకి షెడ్లు

రామభద్రపురం: 2014–19 వరకు వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం గోకులం పేరుతో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించే కార్యక్రమం చేపట్టింది. అప్పట్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో ఈ నిర్మాణాలు చేపట్టారు.అయితే టీడీపీ కార్యకర్తలకే వాటిని కేటాయించారనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉపాధి హామీ నిధులలతో రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు వంటి శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ నిర్మాణాలను పక్కన పెట్టి, మళ్లీ నాటి గోకులం తరహాలోనే 90 శాతం సబ్సిడీతో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించతలపెట్టింది.

జిల్లాకు 700 షెడ్లు కేటాయింపు

జిల్లాకు 700 పశువుల షెడ్లు కేటాయించారు. వాటి నిర్మాణానికి ఉపాధి హామీ జాబ్‌కార్డు తప్పనిసరి చేశారు. గ్రామసభ ఆమోదం కూడా తీసుకోవాల్సి ఉంటుంది. పశువుల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం సబ్సిడీ ఉంటుంది.పశువుల షెడ్లకు 10 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 30 శాతం ఆయా యజమానుల వాటాగా డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుది.షెడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత ఉపాధి నిధుల నుంచి సబ్సిడీకి సంబధించిన బిల్లులు యజమాని బ్యాంకు ఖాతా ద్వారా చెల్లిస్తారు. గోకులం తరహాలోనే ప్రస్తుత షెడ్లను కూడా టీడీపీ కార్యకర్తలకు మంజూరు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఉత్తర్వులు వచ్చాయి..



ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పశువుల షెడ్ల నిర్మాణానికి రైతులను ఎంపిక చేయాలని ఉత్తర్వులు వచ్చాయి.లబ్ధిదారుల ఎంపికపై దృష్టి సారించాలని పశు వైద్యాధికారులు, వెటర్నరీ అసిస్టెంట్లను ఆదేశించాం. లబ్ధిదారుల ఎంపిక రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రారంభిచాం. పశువులకు 10 శాతం, గొర్రెలు, మేకలు, షెడ్లకు 30 శాతం రైతు వాటా చెల్లించాలి. గ్రామ సభ తీర్మానం తప్పనిసరిగా ఉండాలి. ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలి.

వైవీ రమణ, పశువైద్య శాఖ జేడీ,విజయనగరం